


# ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 113,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,సోమవారం, తేదీ : 24-08-2026

## అంతరిక్ష రంగంలో కెరీర్‌ను నిర్మించాలకునే వారు భారత్‌కు రావాలి



- నేషనల్ స్పేస్ డే సందర్భంగా స్పేస్ స్టార్టప్ సీఈఓలు ప్రధాని భేటీ
- ప్రాజెక్టుల వివరాలను మోదీకి వివరించిన పలువురు సీఈఓలు
- స్పేస్‌స్టార్టప్ సీఈఓలను ప్రశంసించిన ప్రధాని
- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

ఢిల్లీ : అంతరిక్ష రంగంలో కెరీర్‌ను నిర్మించాలకునే వారు భారత్‌కు రావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇందుకోసం తమ ప్రభుత్వం విధారనపరమైన మద్దతిస్తుందని తెలిపారు. నేషనల్ స్పేస్ డే సందర్భంగా

## డీలిమిటేషన్ బిల్లు కోసమే లోక్ సభను
# ఇంకా కొనసాగిస్తున్నారా?'

**'డీలిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం అమిత్**

- అమిత్ 2/3 మెజారిటీ కోసం ప్రయత్నిస్తున్నారా?'
- లోక్ సభ ప్రొరోగేషన్ ఆలస్యం వెనుక దురుద్దేశాలు ఉన్నాయా?
- కేంద్రంపై జైరాం రమేశ్ ధ్వజం



ఢిల్లీ : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసినప్పటికీ, లోక్ సభను అధికారికంగా ముగించడంలో (ప్రొరోగేషన్ ) జరుగుతున్న అసాధారణ జాప్యంపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆదివారం మోదీ సర్కార్ పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల ద్వారా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లును ఆమోదింపజేసుకోవడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారా? మిగతా..2లో

## ప్రపంచ నౌకా నిర్మాణ కేంద్రంగా
# మారగల సత్తా భారత్ కు ఉంది

- బంగాల్‌లో రూ.3,500 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు రాజ్‌నాథ్ శంకుస్థాపన
- జీఆర్ఎస్ ఈకి మూడు, యంత్ర ఇండియాకు రెండు ప్రాజెక్టులు
- కొత్త ప్రాజెక్టులతో ఉద్యోగాలు, ఎంఎస్ ఎంఈలకు అవకాశాలు పెరుగుతాయన్న రాజ్‌నాథ్ సింగ్



ఢిల్లీ : ప్రపంచ నౌకా నిర్మాణ కేంద్రంగా మారగల సత్తా భారత్ కు ఉందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తెలిపారు. నౌకా నిర్మాణ రంగంలో ఏర్పడిన అవకాశాలను భారత్ అందిపుచ్చుకోవాలని అన్నారు. బంగాల్ లోని కోల్‌కతా నుంచి గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ ఈ), యంత్ర ఇండియా లిమిటెడ్ విస్తరణకు సంబంధించిన రూ.3,500 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు ఆదివారం మిగతా..2లో

## నిజామాబాద్ అభివృద్ధే ధ్యేయం.. అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తాం



- నిజామాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు..
- నిజామాబాద్ అభివృద్ధే ధ్యేయం.. అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తాం: మహేశ్ కుమార్ గౌడ్

నిజామాబాద్, ఆగస్టు 23: జిల్లాలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే తపనతో ముందుకు సాగుతున్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాకు ఇంజినీరింగ్, వ్యవసాయ కళాశాల తీసుకొచ్చామని, ఇప్పటికే తరగతులు ప్రారంభమయ్యాయని తెలిపారు. లింబాద్రి గుట్టపై గెస్ట్‌హౌస్ నిర్మాణం చేపడుతున్నామని, రాష్ట్రంలో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు నిజామాబాద్ జిల్లాకే మంజూరు చేశామని చెప్పారు.

## అమెరికా పర్యటన రద్దు.. అండగా నిలిచిన ఖర్గేకు
# సీఎం రేవంత్ కృతజ్ఞతలు

- కేంద్రం అనుమతి నిరాకరించడంతో అమెరికా పర్యటన రద్దు
- లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైన సీఎం
- ఈ అంశంలో మద్దతిచ్చిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు ప్రత్యేక కృతజ్ఞతలు
- రాజకీయ కారణాలతోనే పర్యటనను అడ్డుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపణ
- హైదరాబాద్ చేరుకున్నాక పూర్తి వివరాలు వెల్లడిస్తానని ప్రకటన



హైదరాబాద్: తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం 'రాజకీయ కారణాలతో' అనుమతి నిరాకరించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ క్లిష్ట సమయంలో తనకు బలమైన మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. లండన్‌లో తాను చేపట్టాల్సిన అధికారిక సమావేశాలు, కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే, కేంద్ర విదేశాంగ శాఖ తన అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించినందున, తొలుత అనుకున్న ప్రకారం బోస్టన్‌కు వెళ్లకుండానే తన పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. "గడిచిన మూడు రోజులుగా లండన్‌లో నాకు లభించిన మద్దతుకు మిగతా..2లో

## సమ్మె వద్దు.. సమస్యలు
# పరిష్కరిస్తాం


**ఆటో, క్యాబ్ డ్రైవర్లకు మంత్రి పొన్నం భరోసా**

- నేటి అర్ధరాత్రి నుంచి తలపెట్టిన బంద్‌ను విరమించాలని ఆటో డ్రైవర్లకు మంత్రి పొన్నం విజ్ఞప్తి
- ఛార్జీల సవరణపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ
- ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడి
- పాత ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోలు కొంటే ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తామన్న మంత్రి



హైదరాబాద్: ఇవాళ అర్ధరాత్రి నుంచి తలపెట్టిన నిరవధిక బంద్‌ను విరమించుకోవాలని ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లకు తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమ్మెల ద్వారా సమస్యలు పరిష్కారం కావని, చర్చలతోనే సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, వారు చర్చలకు సహకరించాలని కోరారు. హుస్నాబాద్‌లో పర్యటించిన సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. మిగతా..2లో

## టర్కీ నుంచి భారీగా ఆయుధాలు.. పాక్ ఏదో పెద్ద స్కెచ్ వేస్తోందా?



**అంతర్గతంగా ఉన్న సమస్యల్ని పక్కదారి పట్టించేందుకు భారత్‌పై యుద్ధం చేయాలని భావిస్తుందా.**

**డ్రోన్ సంబంధిత పరికరాలు, ఇతర సైనిక సామాగ్రి తరలించి ఉండొచ్చని నివేదికలు సూచిస్తున్నాయి.**

ఢిల్లీ : పాకిస్తాన్ ఏదో భారీగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతర్గతంగా ఉన్న సమస్యల్ని పక్కదారి పట్టించేందుకు భారత్‌పై యుద్ధం చేయాలని భావిస్తుందా.? అనే అనుమానాలు కలుగుతున్నాయి. పాకిస్తాన్ టర్కీ నుంచి భారీగా ఆయుధాలు దిగుమతి చేసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పాకిస్తాన్‌లో కీలక వైమానిక స్థావరమైన నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌కు టర్కీ సైనిక విమానాల మిగతా..2లో

## ఆరోగ్యశ్రీపై ఎందుకంత కక్ష.. రేవంత్ సర్కార్‌పై హరీశ్‌రావు ధ్వజం



**ఆరోగ్యశ్రీ బకాయిలు, సిబ్బందికి జీతాలు చెల్లించడంలో వైఫల్యం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు.**

**ఆరోగ్యశ్రీపై ఎందుకంత కక్ష అని సీఎం రేవంత్ రెడ్డిపై ధ్వజమెత్తారు.**

హైదరాబాద్: ఆరోగ్యశ్రీ సిబ్బంది ఆవేదన వింటే గుండె కలిచి వేస్తోందని హరీశ్‌రావు అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తూ, ఎన్నో కుటుంబాలకు అండగా నిలిచిన ఆరోగ్యశ్రీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయడం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల నిధులు విడుదల కాకపోవడంతో ఆరోగ్యశ్రీ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి 18 నెలలుగా జీతాలు చెల్లించడం లేదని చెప్పారు. నెలల తరబడి జీతాలు లేకుండా సిబ్బంది ఎలా బతకాలి? వారి కుటుంబాల పరిస్థితి ఏమిటి? మిగతా..2లో

## తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ.. సర్వదర్శనానికి 8 గంటలే!




- తిరుమలలో సాధారణ రద్దీ
- 22 కంపార్ట్‌మెంట్లలో వేచి చూస్తున్న భక్తులు
- శనివారం శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.67 కోట్లు
- నిన్న స్వామివారిని దర్శించుకున్న 84 వేల మంది భక్తులు

తిరుపతి : తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ గణనీయంగా తగ్గింది.

## బంగాళాఖాతంలో అల్పపీడనం
# ఉత్తరాంధ్రకు వర్ష సూచన

- ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ వెల్లడి
- పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం
- విజయనగరం, మన్యంతోపాటు పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు
- బంగాళాఖాతంలో అల్పపీడనం



అమరావతి : బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురవనున్నాయి. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. మిగతా..2లో

## ప్రభుత్వ పాఠశాలలపై కూటమిది అబద్ధాల ప్రచారం



- కూటమి ప్రభుత్వంపై మాజీ సీఎం జగన్ తీవ్ర విమర్శలు
- యూడైస్ గణాంకాలతో ప్రభుత్వ వాదనలు అబద్ధమని ఆరోపణ
- ప్రభుత్వ పాఠశాలల్లో 5.56 లక్షల మంది విద్యార్థులు తగ్గారని వెల్లడి
- ప్రైవేటుకు మేలు చేసేందుకే ప్రభుత్వ విద్యను బలహీనపరుస్తున్నారని విమర్శ
- తమ హయాంలో నాడు-నేడు, ట్యాబ్‌లతో విద్యారంగాన్ని మార్చామని వెల్లడి

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక
సోమవారం 12-08-2026

మొదటి పేజి తరువాయి

## తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ..
# సర్వదర్శనానికి 8 గంటలే!

సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు స్వామివారి దర్శనానికి కేవలం 8 గంటల సమయం పడుతోంది. ప్రస్తుతం 22 కంపార్ట్‌మెంట్‌లలో మాత్రమే భక్తులు శ్రీవారి దర్శనం కోసం వేచి ఉండటంతో కొండపై రద్దీ సాధారణ స్థితికి చేరుకుంది. నిన్న శనివారం (ఆగస్టు 22) శ్రీవారిని దర్శించుకున్న భక్తుల వివరాలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. నిన్న ఒక్కరోజే మొత్తం 84,873 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 36,286 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం శ్రీవారి హుండీ ద్వారా రూ. 3.67 కోట్ల కానుకలు లభించినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా, టీటీడీ 4.38 లక్షల లడ్డూ ప్రసాదాలను విక్రయించగా, 2.42 లక్షల మందికి అన్నప్రసాదం అందించింది. తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో 3,523 మందికి వైద్య సేవలు అందించినట్లు టీటీడీ పేర్కొంది.

## టర్కీ నుంచి భారీగా ఆయుధాలు..
# పాక్ ఏదో పెద్ద స్కెచ్ వేస్తోందా?

రాకపోకలు పెరిగినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా సీ-130 హెర్క్యులెస్ విమానాలు రావల్పిండిలోని నూర్ ఖాన్, కరాచీలోని మసూర్ వైమానిక స్థావరాలకు వచ్చినట్లు తెలుస్తోంది. ఆగస్టు 19 నుంచి 21 వరకు టర్కీకి చెందిన జ-130 విమానాలు పాకిస్తాన్‌కు వచ్చి వెళ్లాయి. దీనిని భారత నిఘా వర్గాలు అసాధారణ పరిణామంగా గుర్తించింది. ఈ విమానాల ద్వారా పాకిస్తాన్ డ్రోన్లు, డ్రోన్ సంబంధిత పరికరాలు, ఇతర సైనిక సామాగ్రి తరలించి ఉండొచ్చని నివేదికలు సూచిస్తున్నాయి. ఇదే కాకుండా చైనా నుంచి కూడా భారీగా ఆయుధాల దిగుమతి జరుగుతోందని తెలుస్తోంది. ముఖ్యంగా పాకిస్తాన్ నా సిరీస్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ పొందిందనే వాదన కూడా ఉంది. అయితే, ఈ ఆయుధాలు లేదా డ్రోన్ల సరఫరాపై పాకిస్తాన్ లేదా టర్కీ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ రాలేదు. అయితే, టర్కీ డ్రోన్లపై పాక్ ఎప్పటి నుంచో ఆసక్తి చూపిస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ టర్కీ డ్రోన్లను భారత్‌పై వాడింది. వీటన్నింటిని భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఇప్పటికే బైరక్టర్ టీబీ2 డ్రోన్లు పాక్ వద్ద ఉన్నాయి. గతంలో భారత్ తో సైనిక ఘర్షణ సమయంలో టర్కీ తన డ్రోన్ ఆపరేటర్లను కూడా పాకిస్తాన్‌లో మోహరించింది. ప్రస్తుతం పాక్ తన మానవరహిత వైమానిక సామర్థ్యాలను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా ఎక్కువసేపు గాల్లో ఉండగల డ్రోన్లు, లాయిటరింగ్ మ్యునిషన్ వంటి వ్యవస్థల్ని సమకూర్చుకుంటోంది.

## అమెరికా పర్యటన రద్దు.. అండగా
# నిలిచిన ఖర్గేకు సీఎం రేవంత్ కృతజ్ఞతలు

ఎంతో సంతోషంగా ఉంది. ఈ అంశంలో నాకు మద్దతుగా నిలిచిన పార్టీకి, నాయకులకు, దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ధన్యవాదాలు. హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తర్వాత సంబంధిత అన్ని విషయాలపై మాట్లాడతాను" అని రేవంత్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

### కేంద్రం తీరుపై మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం

అంతకుముందు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రాలకు పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రులు చేసే పర్యటనలను ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం అన్యాయమని ఆయన మండిపడ్డారు. కేంద్రం పక్షపాత వైఖరితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. "కేంద్రానికి నచ్చిన వారికి అనుమతులు ఇవ్వడం, ఇతరులకు నిరాకరించడం సరైంది కాదు. అమెరికాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎన్నారైలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారిని కలిసి తమ రాష్ట్రాల్లో పరిశ్రమలు పెట్టాలని, పెట్టుబడులు తీసుకురావాలని ముఖ్యమంత్రులు ఆహ్వానిస్తారు. ఈ పర్యటనల ద్వారా వచ్చే పెట్టుబడులు కేవలం రాష్ట్రానికే కాక, దేశానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. తద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. అలాంటి కీలకమైన పర్యటనను అడ్డుకోవడం ద్వారా కేంద్రం దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తోంది" అని ఖర్గే వ్యాఖ్యానించారు. లండన్ నుంచి రేవంత్ రెడ్డి నేరుగా హైదరాబాద్‌కు రానుండటంతో, ఆయన తిరిగి వచ్చాక ఈ వివాదంపై ఏ విధంగా స్పందిస్తారనేది రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. ఈ ఘటన కాంగ్రెస్, బీజేపీ మధ్య మరో రాజకీయ ఘర్షణకు దారితీసింది.

## నిజామాబాద్ అభివృద్ధే ధ్యేయం..
# అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తాం

హైదరాబాద్ తరహాలో నిజామాబాద్‌లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఇందిరమ్మ టవర్స్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మాస్టర్ ప్లాన్ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించామని తెలిపారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధితో పాటు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తున్నామని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. సహకార సంఘాల్లో పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులు కల్పిస్తున్నామని చెప్పారు. బీజేపీ నేతలు నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయలేకపోయారని, ఇప్పుడు సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆర్మూర్‌లో పామాయిల్ పరిశ్రమ రాబోతోందని, వ్యవసాయ రంగంలో నిజామాబాద్ రాష్ట్రంలోనే మేటి జిల్లాగా నిలుస్తోందని అన్నారు. జిల్లా అభివృద్ధినే ధ్యేయంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నామని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## ఆరోగ్యశ్రీపై ఎందుకంత కక్ష..
# రేవంత్ సర్కార్‌పై హరీశ్‌రావు ధ్వజం

పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి అద్దెలు, కుటుంబ ఖర్చులు ఎలా భరించాలి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రతి నెల 1వ తేదీకే వేతనాలు చెల్లిస్తాం అని హామీ ఇచ్చారు. మరి మీ సమాధానం ఏంటని నిలదీశారు. సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రులకీ 2023 నవంబర్ నుంచి ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ నిధులు ఒక రూపాయి కూడా ఎందుకు విడుదల కాలేదని తెలిపారు. దాదాపు 24 కోట్లు ఆరోగ్యశ్రీ నిధులు పెండింగ్ లో ఉందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు. నిధులు విడుదల చేయకపోవడం వల్ల ఆసుపత్రుల నిర్వహణ, రోగుల సంరక్షణ, మందులు, వైద్య పరికరాలపై ప్రభావం పడ్డది, సేవలు అందడంలేదని హరీశ్‌రావు తెలిపారు. ఇదే సమయంలో ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులకు కూడా నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో పెట్టారని అన్నారు. ఆసుపత్రులకు బకాయిలు చెల్లించకపోతే వైద్యులు, నర్సింగ్ సిబ్బంది జీతాలు, మందులు, పరికరాల కొనుగోళ్లు, ఆసుపత్రి నిర్వహణపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందన్నారు. ఆరోగ్యశ్రీ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని గొప్పగా ప్రకటించారు. కానీ అది ప్రకటనలకే పరిమితమయ్యిందని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కవరేజీ పెంచామని చెప్పుకుంటున్న ప్రభుత్వం.. మరోవైపు రోజురోజుకూ ఆరోగ్యశ్రీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని హరీశ్‌రావు విమర్శించారు. బకాయిలు పేరుకుపోతూ, ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించడమే ఆసుపత్రులకు భారంగా మారితే.. చివరకు నష్టపోయేది ఎవరు? పేద రోగులే కదా అని ప్రశ్నించారు. పేద ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఆరోగ్యశ్రీకి నిధుల కొరత ఎందుకు వచ్చిందని అడిగారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల మధ్య ఎలాంటి తేడా చూపకుండా, సీనియారిటీ, ఫస్ట్ కమ్-ఫస్ట్ సర్వ్ ప్రాతిపదికన ఆరోగ్యశ్రీ నిధులను విడుదల చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించిన ఆసుపత్రులకు పెండింగ్‌లో ఉన్న రూ.1,400 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 18 నెలలుగా పెండింగ్‌లో ఉన్న సిబ్బంది జతాలు తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసే కుట్రలు ఆపాలని.. పేదల ప్రాణాధారమైన ఆరోగ్యశ్రీని కాపాడాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు..

## పార్లమెంట్ సమావేశాలు ముగియలేదు,
## వాయిదానే వేశారు- కీలక బిల్లు ఆమోదం కోసమేనా?

### ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడిన ఉభయ సభలు
### పది రోజులు గడిచినా జారీ కాని ప్రొరోగ్ ఉత్తర్వులు
### మహిళా రిజర్వేషన్ అమలుకు కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు చర్చ

పార్లమెంటు ఉభయసభలు నిరవధికంగా వాయిదాపడి 10రోజులు దాటినా వర్షాకాల సమావేశాలను ప్రభుత్వం ఇంకా అధికారికంగా ముగించలేదు.లో క్సభ, రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడి పది రోజులు గడిచినా, ఇప్పటివరకు సమావేశాల ప్రొరోగ్‌పై అధికారిక ప్రకటన వెలువడలేదు. రాష్ట్రపతి ఇంకా ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఇలా చేయడం వెనక కేంద్ర ప్రభుత్వ వ్యూహం ఏమైనా ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకొచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు మరోసారి ఊపందుకున్నాయి. పార్లమెంట్ సమావేశాలు నిరవధిక వాయిదా కావడం, 'ప్రొరోగ్' కావడం రెండూ వేర్వేరు. సభలను నిరవధికంగా వాయిదా వేయడాన్ని అడ్జర్న్‌మెంట్ సైన్ డై అంటారు. అయితే రాష్ట్రపతి అధికారికంగా సమావేశాన్ని ముగిస్తూ ప్రకటన జారీ చేసినప్పుడే ప్రొరోగేషన్ పూర్తవుతుంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వ సిఫార్సుతో పార్లమెంట్ సమావేశాలను పిలుస్తారు, ముగిస్తారు. సాధారణంగా ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడిన రెండు నుంచి నాలుగు రోజుల్లోనే ప్రొరోగేషన్ జరుగుతుంది. ఉదాహరణకు ఈ ఏడాది బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 18న ముగియగా, ఏప్రిల్ 20న ప్రొరోగేషన్ ఉత్తర్వులు జారీ చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలపై కూటమిది అబద్ధాల ప్రచారం

మొదటి పేజి తరువాయి

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యా రంగంపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు భారీగా తగ్గిపోతున్నారని, కూటమి ప్రభుత్వం మాత్రం అబద్ధపు ప్రచారాలు చేసుకుంటోందని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడైస్ ప్లస్ గణాంకాలను ఉటంకిస్తూ సోషల్ మీడియా వేదికగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేటు పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని ప్రచారం చేసుకోవడంపై జగన్ మండిపడ్డారు. ఇది వాస్తవమైతే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి కదా? అని ప్రశ్నించారు. కానీ, యూడైస్ గణాంకాల ప్రకారం 2023-24 విద్యా సంవత్సరంతో పోలిస్తే, 2025-26 నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 40,50,116 నుంచి 34,93,450కి



పడిపోయిందని, అంటే ఏకంగా 5,56,666 మంది విద్యార్థులు తగ్గిపోయారని జగన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45,53,380 నుంచి 48,40,296కు పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య కూడా 45 వేల నుంచి 44,222కు తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీకి నారాయణ, శ్రీచైతన్య వంటి కార్పొరేట్ విద్యా సంస్థలతో ఉన్న సంబంధాల కారణంగానే, ప్రభుత్వ విద్యా వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా బలహీనపరుస్తున్నారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. తద్వారా ప్రైవేటు సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం బాటలు వేస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. తమ హయాంలో విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామని జగన్ గుర్తుచేశారు. 'మనబడి నాడు-నేడు' కింద రూ.8,524 కోట్లతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించామని, విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశామని వివరించారు. ఆంగ్ల మాధ్యమాన్ని ప్రోత్సహిస్తూ టోఫెల్ వంటి అంతర్జాతీయ స్థాయి శిక్షణకు సైతం శ్రీకారం చుట్టామని తెలిపారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యారంగం తిరోగమనంలో పయనిస్తుండటం ఆందోళనకరమని జగన్ అన్నారు. ప్రభుత్వ ప్రచారంలోని డొల్లతనాన్ని ఈ లెక్కలే బయటపెడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం - ఉత్తరాంధ్రకు వర్ష సూచన

మొదటి పేజి తరువాయి

అటు వర్షాల కోసం మార్కాపురం జిల్లాలో స్థానికులు వినూత్న పూజలు నిర్వహించారు. ఉత్తరాంధ్రపై అల్పపీడన ప్రభావం : బంగాల్ - బంగ్లాదేశ్‌ను ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ తాజా బులెటిన్‌లో తెలిపింది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో వాతావరణం చల్లబడనుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వానలు పడతాయని అధికారులు అంచనా వేశారు. అలాగే శ్రీకాకుళం, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలతో పాటు పోలవరం పరిసర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. యంత్రాంగానికి మంత్రి ఆదేశాలు : వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మంత్రి వంగలపూడి అనిత అధికారులను అప్రమత్తం చేశారు. ఉత్తరాంధ్రలో వర్షాలు పడుతున్నందున జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తీరప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సముద్రం అలజడిగా ఉండే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వాతావరణ శాఖ హెచ్చరికలను పాటించాలన్నారు. ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. తీరప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలీస్, రెవెన్యూ, మత్స్యశాఖ, విపత్తుల నిర్వహణ శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని మంత్రి స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. వర్షాల కోసం 101 బిందెలతో జలాభిషేకం : ఒకవైపు అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తుండగా, మరోవైపు వానలు సమృద్ధిగా పడాలని రైతులు, ప్రజలు వినూత్న పూజలు చేస్తున్నారు. మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం మండలం



పిల్లికుంట తండాలో గ్రామస్థులు ప్రత్యేక భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ స్థానిక పోలేరమ్మ, గంగమ్మ తల్లులకు బిందెలతో నీళ్లు పోసి జలాభిషేకం చేశారు. ముఖ్యంగా గంగమ్మ తల్లికి 101 బిందెల నీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వాన దేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. పాడిపంటలు వృద్ధి చెంది, ప్రతి ఒక్కరూ సిరిసంపదలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని గ్రామస్థులు మొక్కుకున్నారు.

# సమ్మె వద్దు.. సమస్యలు పరిష్కరిస్తాం: ఆటో, క్యాబ్ డ్రైవర్లకు మంత్రి పొన్నం భరోసా

మొదటి పేజి తరువాయి

ఆటో కార్మికుల ప్రధాన డిమాండ్లలో ఒకటైన ఛార్జీల సవరణపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలో 2015 నుంచి ఆటో ఛార్జీలు పెరగలేదన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, పెరుగుతున్న నిర్వహణ వ్యయాలను దృష్టిలో ఉంచుకుని ఛార్జీల పెంపుపై అధ్యయనం చేసేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కమిటీలో రవాణా శాఖ అధికారులతో పాటు ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులకు కూడా స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, ఆటో కార్మికుల కోసం ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కేబినెట్ ఇప్పటికే నిర్ణయం తీసుకుందని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ బోర్డు





కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలుగా మార్గదర్శకాలను త్వరలోనే ఖరారు చేస్తామని పేర్కొన్నారు. గతంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలను ఎంత సీరియస్‌గా తీసుకుని పరిష్కరించామో, అదే రీతిలో ఆటో కార్మికుల సమస్యలనూ పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆటో డ్రైవర్ల ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకుని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి తెలిపారు. పాత డీజిల్, పెట్రోల్ ఆటోలను స్క్రాప్ చేసి కొత్త ఎలక్ట్రిక్ ఆటోలను కొనుగోలు చేసే డ్రైవర్లకు ప్రభుత్వ సహకారం అందిస్తామన్నారు. అలాగే, పాత వాహనాలను గ్రీన్ ఎనర్జీలోకి మార్చుకునేందుకు (రెట్రోఫిట్టింగ్) త్వరలోనే ఒక కొత్త పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో, ఆటో, క్యాబ్ డ్రైవర్లు తమ బంద్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, ప్రభుత్వంతో చర్చలకు ముందుకు రావాలని పొన్నం ప్రభాకర్ మరోసారి కోరారు.

# ప్రపంచ నౌకా నిర్మాణ కేంద్రంగా మారగల సత్తా భారత్ కు ఉంది: రాజ్ నాథ్ సింగ్

మొదటి పేజి తరువాయి

ఆయన వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ప్రపంచ నౌకా నిర్మాణ రంగంలో ప్రస్తుతం ఒక రకమైన ఖాళీ ఏర్పడుతోందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ అవకాశాన్ని భారత్ ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారత్ ప్రపంచ షిప్‌బిల్డింగ్ హబ్‌గా మారగలదని అన్నారు. రక్షణ రంగంలో స్వావలంబన సాధించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి ఈ ప్రాజెక్టులు దోహదం చేస్తాయని చెప్పారు. దేశీయంగా యుద్ధ నౌకల తయారీ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు విదేశాలపై ఆధారపడటాన్ని మరింత తగ్గించేందుకు ఇవి ఉపయోగపడతాయని వివరించారు. పరిశ్రమలకు కొత్త ఊపు బంగాల్ లో పారిశ్రామిక రంగంలో కొత్త మార్పు కనిపిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గతంలో రాష్ట్రం నుంచి పరిశ్రమల మూసివేతలు, లాకౌట్ల వార్తలు ఎక్కువగా వచ్చేవని, ఇప్పుడు కొత్త ప్రాజెక్టుల ప్రారంభ వార్తలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. కొత్త పెట్టుబడులతో పరిశ్రమలకు ఊతం లభించడంతో పాటు భారీగా ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (మీఎస్‌ఎంఈ) రక్షణ ఉత్పత్తి రంగంలో భాగస్వాములు కావడానికి అవకాశాలు పెరుగుతాయని వివరించారు.

'స్వావలంబనకు ఇవి కీలక అడుగులు'

దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో రక్షణ రంగానికి కీలక స్థానం ఉందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తావించిన సప్తధార అభివృద్ధి మార్గాల్లో రక్షణ రంగం కూడా ఒకటని గుర్తుచేశారు. దేశ రక్షణ అవసరాలను సాధ్యమైనంత వరకు దేశీయంగానే తీర్చాలన్న లక్ష్యంతో కేంద్రం ముందుకు సాగుతోందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ రంగ సంస్థల మౌలిక వసతులను బలోపేతం చేయడం కీలకమని పేర్కొన్నారు. ఈ పెట్టుబడులు కేవలం నేటి అవసరాల కోసం కాదని, భవిష్యత్తు కోసమని అన్నారు. సుమారు రూ.3,500 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశామని, భారత్ నిర్మాణంలో ఇవి కీలక అడుగులని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

800కు పైగా నౌకల నిర్మాణం

జీఆర్ ఎస్ ఈ పనితీరును రక్షణ మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. సంస్థ ఇప్పటివరకు 800కు పైగా నౌకలను నిర్మించిందని తెలిపారు. అధునాతన సముద్ర నౌకల తయారీలో దేశీయ సామర్థ్యాన్ని పెంచుతూ, విదేశీ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడంలో జీఆర్ ఎస్ ఈ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇక్కడే ఏఎన్ ఎస్ ద్రోణగిరి వంటి యుద్ధ నౌకలు నిర్మించబడ్డాయని గుర్తుచేశారు. సవాళ్లను స్వీకరిస్తూ ముందుకు సాగుతున్న జీఆర్ ఎస్ ఈకి నవరత్న హోదా దక్కడం అభినందనీయమన్నారు. రక్షణ పరిశ్రమలో యంత్ర ఇండియా లిమిటెడ్ కూడా కీలక భాగస్వామిగా ఎదుగుతోందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 2021 అక్టోబర్‌లో కార్యకలాపాలు ప్రారంభించినప్పటి నుంచి సంస్థ ఆర్థిక, నియంత్రణ పరంగా మంచి పనితీరును కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఐదు ప్రాజెక్టుల్లో మూడు జీఆర్ ఎస్ ఈకి సంబంధించినవి కాగా, మరో రెండు యంత్ర ఇండియా లిమిటెడ్‌కు చెందినవి. నౌకా నిర్మాణం, యుద్ధ నౌకల మరమ్మతులు, ఆధునీకీకరణ వంటి కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు జీఆర్ ఎస్ ఈ చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో కోల్‌కతాలోని శ్యామ ప్రసాద్ ముఖర్జీ పోర్టుతో జీఆర్ ఎస్ ఈ రెండు చిన్న షిప్‌యార్డుల కోసం లీజు ఒప్పందాలు కుదుర్చుకుంది. హుగ్లీ నదికి ఇరువైపులా ఈ షిప్‌యార్డులు ఏర్పాటు కానున్నాయి. వీటితో పాటు రైచక్ ప్రాంతంలో నదీ తీరాన ఉన్న 32 ఎకరాల స్థలాన్ని కూడా జీఆర్ ఎస్ ఈ తన కార్యకలాపాల విస్తరణకు వినియోగించుకోనుంది. దీంతో యుద్ధ నౌకల నిర్మాణం, రీఫిట్ సామర్థ్యాలు మరింత పెరగనున్నాయి.

డీలిమిటేషన్ బిల్లు కోసమే లోక్ సభను ఇంకా కొనసాగిస్తున్నారా?'- మోదీ సర్కార్ పై జైరాం రమేశ్ విమర్శలు

అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. 'సాధారణంగా లోక్ సభ నిరవధికంగా వాయిదా (అడ్జర్నమెంట్ సైన్ డై) పడిన రెండు నుంచి నాలుగు రోజుల్లోనే సభను అధికారికంగా ముగిస్తూ (ప్రొరోగేషన్) ఉత్తర్వులు వస్తాయి. కొన్ని సందర్భాల్లో వాయిదా పడిన రోజే ఈ ప్రక్రియ కూడా పూర్తవుతుంది. ఈ లోక్ సభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 10 రోజులు గడుస్తున్నా, సభ ముగింపుపై ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు. గతంలో 2015 వర్షాకాల సమావేశాల ముగింపునకు 28 రోజులు, 2021లో 20 రోజులు పట్టిన మాట వాస్తవమే. కానీ అప్పట్లో దీని వెనుక ఎలాంటి దురుద్దేశపూర్వక వ్యూహాలు లేవు. మరి ఇప్పుడు జరుగుతున్న ఈ అసాధారణ ఆలస్యానికి కారణం ఏమిటి? ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారా? అందుకు కావాల్సిన 2/3 వంతు మెజారిటీ కోసం వెతుకుతున్నారా?"

- జైరాం రమేశ్ , కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

మహిళా రిజర్వేషన్ తో ముడి! మహిళా రిజర్వేషన్ తో ముడిపడి ఉన్న ఈ డీలిమిటేషన్ రాజ్యాంగ సవరణ బిల్లు, అంతకు ముందు జరిగిన బడ్జెట్ సమావేశాల్లో వీగిపోయింది. వాస్తవానికి ఈ బిల్లు ద్వారా లోక్ సభ స్థానాల సంఖ్యలను 850 వరకు పెంచాలని కేంద్రం భావించింది. కానీ 2/3 మెజారిటీ లేకపోవడంతో ఆ బిల్లుకు ఆమోదం లభించలేదు. అందుకే ఆ బిల్లును ఈసారి లోక్ సభలో ప్రవేశపెట్టేందుకు మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ విమర్శిస్తోంది. దీనిపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లును పార్లమెంట్ ముందుకు మళ్లీ ఎప్పుడు తీసుకువస్తామనే దానిపై ప్రభుత్వం ఎలాంటి నిర్దిష్ట కాలపరిమితిని ఖరారు చేయలేదని పేర్కొన్నారు. "మేము ఈ డీలిమిటేషన్ బిల్లును తీసుకువస్తామని ఎప్పుడు చెప్పాం? అయితే మీడియాలో కొన్ని ఊహాగానాలు వచ్చిన మాట వాస్తవం. దీనిని ఎప్పుడు తీసుకురావాలనేది మా అధినాయకత్వం పూర్తిస్థాయిలో చర్చించిన తర్వాతే నిర్ణయిస్తుంది" అని స్పష్టం చేశారు. కాగా, కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు ఈ డీలిమిటేషన్ బిల్లును మహిళా రిజర్వేషన్లతో ముడిపెడుతున్నాయి. లోక్ సభలో ప్రస్తుతం ఉన్న స్థానాల పరిమితిలోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. అంతేకాదు తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (యూబీటీ) లాంటి పార్టీల నుంచి ఎంపీలను, బీజేపీ తన అక్కున చేర్చుకుని డీలిమిటేషన్ బిల్లును ఎలాగైనా ఆమోదింపజేసుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నాయి.

మోదీ సర్కార్ ప్లాన్ ఇదేనా?

కాగా, 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు వేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం డీలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందాల్సి ఉంటుంది. గతంలో కూడా ఈ బిల్లుల ఆమోదం కోసం కేంద్రం ప్రయత్నాలు

# అంతరిక్ష రంగంలో కెరీర్‌ను నిర్మించాలకునే వారు భారత్‌కు రావాలి

మొదటి పేజి తరువాయి

స్పేస్ స్టార్టప్ సీఈఓలు ప్రధానితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాము చేపట్టనున్న ప్రాజెక్టుల వివరాలను పలువురు సీఈఓలు మోదీకి వివరించారు. అనంతరం మాట్లాడిన ప్రధాని మోదీ, అంతరిక్ష రంగంలోకి ప్రవేశించి ఎంతో ధైర్యాన్ని ప్రదర్శించారని స్పేస్‌స్టార్టప్ సీఈఓలను ప్రశంసించారు. స్పేస్ టెక్నాలజీతో ప్రజా సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని వారికి సూచించారు. ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష రంగంలో ఉన్న ప్రతిభావంతులను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మోదీ వెల్లడించారు. అంతరిక్ష రంగంలో పనిచేస్తున్న 20 స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులతో ప్రధాని మోదీ ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్తు అవకాశాలు, సాంకేతికత వినియోగంపై చర్చలు జరిపారు. ఈ భేటీకి సంబంధించిన వీడియోను మోదీ తమ ఎక్స్ పోస్టులో పంచుకున్నారు. ఎప్పటిలాగే, భారత్ అంతరిక్ష ప్రయాణంపై స్టార్టప్‌ల అభిప్రాయాలు, ఆశావహ దృక్పథం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని ప్రధాని పేర్కొన్నారు.

### భరోసా కల్పించడమే మా లక్ష్యం

అంతరిక్ష రంగం వంటి కొత్త విభాగంలో అడుగుపెట్టిన స్టార్టప్ వ్యవస్థాపకులను మోదీ అభినందనలు తెలిపారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో స్థిరత్వం ఎంతో ముఖ్యమని, దీనివల్ల రిస్క్ తీసుకునే వ్యాపారవేత్తలకు పూర్తి భరోసా లభిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. తమ తప్పిదాల వల్ల ఏదైనా సమస్య వస్తే అది వేరే విషయమని, కానీ ప్రభుత్వ విధానాల మార్పులతో మధ్యలో వదిలివేయరనే నమ్మకం ఉండాలని తెలిపారు. రిస్క్ తీసుకునే వారికి భరోసా కల్పించే వాతావరణాన్ని సృష్టించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

### రిస్క్ తీసుకుంటేనే మనకంటూ ఓ ప్రత్యేకమైన స్థానం

మరోవైపు, అంతరిక్ష రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులను భారత్ ఆకర్షించగలదని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ రంగంలో భవిష్యత్తును నిర్మించుకోవాలనుకునే ప్రపంచ నిపుణులు భారత్‌కు వచ్చేలా ఒక ప్రత్యేకమైన వాతావరణాన్ని సృష్టించాలని చెప్పారు. రిస్క్ తీసుకుంటేనే మనకంటూ ఓ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకోగలమని అభిప్రాయపడ్డారు. నైపుణ్యం విషయంలో భారత్‌కు ఎలాంటి కొరత లేదని, ఖర్చుల పరంగా కూడా భారత్ పోటీదారుగా ఉందని అన్నారు.

### 'ప్రజల జీవితాలను ఎలా సులభతరం చేయవచ్చో ఆలోచించాలి'

ప్రజల జీవితాలను మెరుగుపరచడంలో స్టార్టప్ లకు మోదీ పలు కీలక సూచనలు చేశారు. అంతరిక్ష సంస్థలు కేవలం ఉపగ్రహాలు, ప్రయోగాలకే పరిమితం కాకుండా తమ సాంకేతికతతో ప్రజల జీవితాలను ఎలా సులభతరం చేయవచ్చో ఆలోచించాలని అన్నారు. అలాగే, వ్యవసాయ రంగంలో పనిచేసే స్పేస్ టెక్నాలజీ సంస్థలు

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

సోమవారం 24-08-2026

## దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 23 ప్రజా న్యూస్ నెట్వర్క్ ..:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ లోని పెద్ద చెరువు కట్ట మైసమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ మరియు ఇందిరమ్మ కాలనీలోని నడిగడ్డ నాగులమ్మ ఎల్లమ్మ తల్లి బోనాల కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు..ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భోనమెత్తిన బాచుపల్లి

### అమ్మవారి అనుగ్రహం ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలి : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 23 ప్రజా న్యూస్ నెట్వర్క్ :** శ్రావణమాస భోనాలను పురస్కరించుకొని బాచుపల్లి, రాజీవ్ గాంధీ నగర్, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో నిర్వహించిన బోనాల వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై నల్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, నల్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ తల్లుల దీవెనలు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమం లో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కౌన్సిలర్ శంభీ పూర్ క్రిష్ణ, మాజీ కార్పొరేటర్లు కాసాని సుధాకర్, ఆగం రాజు, గాజుల సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు సలీం, చంద్రగిరి సతీష్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.

## రామాపురంలో వైభవంగా బోనాల పండుగ

### ముత్యాలమ్మకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించిన మహిళలు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ఆగస్టు 23,ప్రజా న్యూస్ నెట్వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని రామాపురం గ్రామంలో ఆదివారం బోనాల పండుగను గ్రామ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి మహిళలు ప్రత్యేకంగా బోనాలు సమర్పించి భక్తితో పూజలు నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను అందంగా అలంకరించి నెత్తిన ఎత్తుకుని మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. మహిళల బోనాల ఊరేగింపుతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది. ఆలయం పరిసర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామ ప్రజలు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ



సందర్భంగా సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ముత్యాలమ్మ అమ్మవారిని భక్తులు వేడుకున్నారు. గ్రామంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని, ప్రజల కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల వేడుకల్లో నేరేడుచర్ల ఎస్సై గోపాల్ రెడ్డి, 7వ వార్డు కౌన్సిలర్ వాసా జ్యోతి శేఖర్ ప్రత్యేకంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. గ్రామ పెద్దలు కొదమగుండ్ల నాగరాజు, చందమల్ల వెంకన్న, చందమల్ల లక్ష్మయ్య, సామ సురేష్, శివనేని విజయ్, అనిల్, ఏసు తదితరులు బోనాల వేడుకల్లో పాల్గొని పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించడంతో పాటు సంప్రదాయ పద్ధతిలో అమ్మవారిని కొలిచారు. యువత, భక్తులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై వేడుకల్లో భాగస్వాములయ్యారు. మేళతాళాలు, భక్తుల సందడితో రామాపురం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి సంవత్సరం గ్రామ ప్రజలు ఐక్యంగా నిర్వహించే బోనాల పండుగ ఈసారి కూడా ఘనంగా జరగడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామదేవత ముత్యాలమ్మ ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా గ్రామస్థులు ఆకాంక్షించారు.

## గుర్రంపోడు మండల ఉప సర్పంచ్‌ల ఫోరం గౌరవ అధ్యక్షులు పోలోజు దక్షిణ చారికి సన్మానం

**గుర్రంపోడు మండల ఉప సర్పంచ్‌ల ఫోరం గౌరవ అధ్యక్షులు పోలోజు దక్షిణ చారికి సన్మానం**

గుర్రంపోడు మండల ఉప సర్పంచ్‌ల ఫోరం గౌరవ అధ్యక్షులుగా ఇటీవల నియమితులైన ములకలపల్లి గ్రామానికి చెందిన పోలోజు దక్షిణ చారి నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ములకలపల్లి గ్రామంలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సన్మాన కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షులు కర్నాటి యాదగిరి, మండలి లింగయ్య పాల్గొని మాట్లాడారు. తమ గ్రామానికి చెందిన దక్షిణ చారి మండల స్థాయి గౌరవ అధ్యక్షులుగా ఎంపిక కావడం ములకలపల్లి గ్రామానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు. నూతన కమిటీ నాయకత్వంలో మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులందరూ కలిసికట్టుగా తోడ్పడాలని వారు పిలుపునిచ్చారు.అనంతరం నూతన గౌరవ అధ్యక్షులు పోలోజ్ దక్షిణ చారి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన నాయకులకు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డల పరిధిలోని ప్రజాసమస్యల పరిష్కారానికి, ఉప సర్పంచ్‌ల హక్కుల సాధనకు నిరంతరం శ్రమిస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శంకరాచారి, పాండ్ర చారి, అనంత చారి, బిక్షమాచారి,ఆచారి, పగిళ్ల భాస్కర్, భీమనపల్లి ఆంజనేయులు, మండలి భూషయ్యా, భూపాల్, రాజు, పోలోని యాదాద్రి, జాల యాదాద్రి, పొగాకు అనూష్ రాజు, భీమనపల్లి లచ్చయ్య తదితరులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.



## ఆలయ భూములను పరిరక్షించేంతవరకు పోరాటం కొనసాగుతుంది.

### ఆలయ భూముల పరిరక్షణ కమిటీ పిలుపు.



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 23 ప్రజా న్యూస్ నెట్వర్క్ :** జగద్గిరిగుట్టలో నెలకొన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించినటువంటి 14 ఎకరాల 10 గుంటల భూమి ని కాపాడాలని కోరుతూ నేడు అఖిలపక్షల ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట చివరి బస్టాండ్ లో రిలే నిరాహార దీక్షను కొనసాగించడం జరిగింది.ఈ రిలే నిరాహార దీక్షలను సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం లిప్రారంభించగా దీక్షలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ జనసేన అధికార ప్రతినిధి సతీష్ బిజెపి నాయకులు మాధవులు టీజేఎస్ నాయకులు ఎర్రవీరన్న కార్మిక నాయకులు దుర్గయ్య లు కూర్చోవడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూములను సర్వే చేసి హద్దులు నిర్ణయించి దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకునేంతవరకు ఈ పోరాటం కొనసాగుతుందని అందులో భాగంగానే నేడు నిరాహార దీక్షలో కూర్చున్నామని ఒకవేళ అధికారులు ఇంకా నిర్లక్ష్యం వహిస్తే అధికారులకు వ్యతిరేకంగా పోరాడాల్సి వస్తుందని హెచ్చరించారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం 12 వారాల్లోనే సర్వే నిర్వహించాల్సిందిగా ఉన్నప్పటికీ గత నెల రోజుల నుండి ఎమ్మార్వో కి మరియు కలెక్టర్ కి వినతి పత్రాలు ఇస్తున్నప్పటికీ వారు పట్టించుకోకపోవడం హైకోర్టు ఆదేశాలను లెక్కచేయకపోవడమేనని వచ్చే వారం రోజుల్లో సర్వే నిర్వహించకపోతే హైకోర్టులో వారు దోషులుగా నిలబడాల్సి వస్తుందని అన్నారు. ఈ పోరాటంలో కలిసి వచ్చే వారందరినీ కలుపుకొని ప్రజలను చైతన్యవంతం చేసి భూములను కాపాడుకునేంతవరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, రాములు కోశాధికారి సదానంద ప్రజానాట్య మండల అధ్యక్షులు బాబు యువజన కార్యదర్శి వెంకటేష్ ఎం సిపిఐ నాయకులు రవీందర్ గౌడ్ జనసేన నాయకురాలు అనుపమ మహేష్ ఆకుల సతీష్ టీం ఆకుల సతీష్, జయశంకర్ గౌడ్, పులిబలరామ్ సిపిఐ నాయకులు వెంకటేష్, సోమయ్య, ఇమామ్ జంబు చంద్రయ్య, శ్రావణ్,ఉపేందర్ లతోపాటు జనసేన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## రైతు బీమా పునరుద్ధరణ చేయకుండా రైతు కుటుంబాలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

### దుర్గయ్య కుటుంబానికి రూ.5 లక్షల రైతు బీమా అందించాలి: బీఆర్ఎస్ డిమాండ్



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 23, ప్రజా న్యూస్ నెట్వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** రైతులకు అండగా నిలిచే రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం సకాలంలో పునరుద్ధరించకపోవడం వల్ల పేద రైతు కుటుంబాలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు పెరుమాళ్ల సతీష్ ఆరోపించారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం ముసివోడ్డు సింగారం గ్రామానికి చెందిన యువ రైతు నకిరేకంటి దుర్గయ్య ఈ నెల 15వ తేదీ రాత్రి అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. దుర్గయ్యకు సుమారు 30 గుంటల వ్యవసాయ భూమి ఉండటంతో పాటు రైతు బీమా బాండ్ కూడా ఉందని, అయితే ఆయన మృతిచెందిన అనంతరం కుటుంబ సభ్యులు రైతు బీమా కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించగా ప్రస్తుతం ఉన్న బీమా బాండ్ చెల్లుబాటు కాదని, ఆగస్టు 12వ తేదీకి ముందు మృతి చెందిన రైతులకు మాత్రమే ప్రస్తుత బీమా కాలానికి వర్తిస్తుందని అధికారులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారని పేర్కొన్నారు. రైతు బీమా వంటి కీలకమైన సంక్షేమ పథకాన్ని ప్రభుత్వం సకాలంలో పునరుద్ధరించి ఉంటే దుర్గయ్య కుటుంబానికి భరోసా లభించేదని, ప్రస్తుతం బీమా సాయం అందకపోవడం వల్ల ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోందని పెరుమాళ్ల సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. దుర్గయ్య మృతితో ఇప్పటికే కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయిన పరిస్థితి ఏర్పడిందని, మరోవైపు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబానికి ఆర్థిక భారం మరింత పెరిగిందని అన్నారు. భార్య నకిరేకంటి అంజమ్మతో పాటు చిన్నారి, ఇతర కుటుంబ సభ్యులు భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు దుర్గయ్య కుటుంబాన్ని పరామర్శించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల వద్ద ఉన్న రైతు బీమా బాండ్‌ను పరిశీలించి, రైతు కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2018లో రైతు కుటుంబాలకు భరోసా కల్పించే ఉద్దేశంతో రైతు బీమా పథకాన్ని అమలు చేశామని, రైతు మరణించిన సందర్భంలో కుటుంబానికి రూ.5 లక్షల బీమా సాయం అందేలా చర్యలు తీసుకున్నామని పెరుమాళ్ల సతీష్ తెలిపారు. రైతు కుటుంబానికి అత్యంత క్లిష్ట సమయంలో ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అనేక కుటుంబాలకు ప్రయోజనం కలిగిందని పేర్కొన్నారు. రైతు బీమా పథకం నిరంతరంగా అమలులో ఉండేలా ప్రతి సంవత్సరం సకాలంలో పునరుద్ధరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతు బీమా పునరుద్ధరణలో ఏర్పడిన గడువు కారణంగా ఏ ఒక్క రైతు కుటుంబం కూడా నష్టపోకూడదని, అర్హత ఉన్న కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక నిర్ణయం తీసుకోవాలని కోరారు. రైతు బీమా బాండ్ చేతిలో ఉన్నప్పటికీ కుటుంబానికి బీమా ప్రయోజనం అందకపోవడం పట్ల గ్రామస్థులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రైతు మరణించిన సమయంలో కుటుంబాన్ని ఆదుకోవాల్సిన ప్రభుత్వ పథకం సాంకేతిక కారణాలతో అందకుండా పోతే ఆ కుటుంబం పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు రైతుల సంక్షేమానికి సంబంధించిన పథకాలను సమర్థవంతంగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా రైతు కుటుంబాలకు భరోసా కల్పించే రైతు బీమా పథకంలో ఎలాంటి విరామం లేకుండా పునరుద్ధరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నకిరేకంటి దుర్గయ్య కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించి ప్రభుత్వ పరంగా రూ.5 లక్షల రైతు బీమా సాయం అందేలా చర్యలు తీసుకోవాలని పెరుమాళ్ల సతీష్ విజ్ఞప్తి చేశారు. పేద రైతు కుటుంబం మరింత అప్పుల భారంలోకి వెళ్లకుండా ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కోరారు. రైతు కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని, అవసరమైన స్థాయిలో సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రైతుల సంక్షేమం, రైతు కుటుంబాల భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణ నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోయబోయిన బిక్షం, కోటయ్య, కొండలు, గౌస్, నన్నేసాబ్, కాశయ్య, నరేందర్, సీతారాములు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ సాధన సమితి పోరాటానికి బార్ అసోసియేషన్ సంఘీభావం

### సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేయాలి: తలమల్ల హస్సేన్



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ,ఆగస్టు 23, ప్రజా న్యూస్ నెట్వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** సూర్యాపేట జిల్లా కేంద్రం మీదుగా బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుల్లెట్ ట్రైన్ సాధన సమితి అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు పదో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రైతుబజార్ వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో వ్యవసాయ మార్కెట్ ఆర్థిదారులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తలమల్ల హస్సేన్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ కమిటీ తరపున దీక్షా శిబిరాన్ని సందర్శించి ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా తలమల్ల హస్సేన్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా మీదుగా బుల్లెట్ ట్రైన్ వెళ్లేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గత తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న దీక్షలు పదో రోజుకు చేరుకున్నప్పటికీ ఉద్యమం పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. సూర్యాపేట జిల్లా అభివృద్ధికి బుల్లెట్ ట్రైన్ ఎంతో కీలకమని, ప్రజా రవాణా సౌకర్యాలు, వ్యాపార, వాణిజ్య రంగాల అభివృద్ధికి ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. బుల్లెట్ ట్రైన్ సాధన కోసం అఖిలపక్షాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలిపి ఐక్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## గోదావరి నీళ్లపై లెక్కలతో తేల్చుకుందాం.. దమ్ముంటే రండి!

### పోతిరెడ్డిపాడు నుంచి నీటి తరలింపుపై ప్రభుత్వం స్పందించాలి: జగదీశ్ రెడ్డి



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ఆగస్టు 23, ప్రజా న్యూస్ నెట్వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** పోతిరెడ్డిపాడు నుంచి నీటి తరలింపు అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కనీసం స్పందించకపోవడం పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. సూర్యాపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగార్జునసాగర్ పరిధిలో తాగునీరు, సాగునీటికి సంబంధించిన నీటి లభ్యతపై అనేక రికార్డులు, అధికారిక లెక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కృష్ణా జలాల వినియోగం విషయంలో తెలంగాణ ప్రయోజనాలకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ముందుకు రావాలని డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ పరిధిలోని రైతులు, ప్రజల సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటి నిర్వహణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. నాగార్జునసాగర్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన తర్వాతే పోతిరెడ్డిపాడు గేట్లు ఎత్తే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీటి తరలింపు విషయంలో ప్రభుత్వం వాస్తవాలను ప్రజలకు వివరించాలని, అందుబాటులో ఉన్న రికార్డులు, నీటి లెక్కల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. గోదావరి, కృష్ణా జలాల వినియోగం, ప్రాజెక్టుల నీటి లభ్యతపై ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య బహిరంగ చర్చ జరగాలని కోరారు. ఈ అంశంపై ఎవరి వద్ద ఏ లెక్కలు, ఏ ఆధారాలు ఉన్నాయో ప్రజల ముందే వెల్లడించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని జగదీశ్ రెడ్డి సవాల్ విసిరారు. నీటి హక్కులు, రైతుల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, తెలంగాణకు రావాల్సిన నీటి వాటాను కాపాడేందుకు బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## ఘనంగా పిట్టలగూడెం జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.

**గుర్రంపోడు: ఆగస్టు 23 (ప్రజా న్యూస్ రిపోర్టర్ గుర్రంపోడు ప్రతినిధి దోటి.శ్రీను )** గుర్రంపోడు మండలం పిట్టలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2008–09 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం దర్వేశిపురం ఆనందపు రామ్మూర్తి ఫంక్షన్ హాల్,నందు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చదువుకున్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకుంటూ, చిన్ననాటి స్నేహాలు,హాస్య సంఘటనలను పంచుకోవడానికి పూర్వ విద్యార్థులంతా ఒక్కటై ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా విద్య నేర్పించిన గురువులను ఘనంగా సత్కరించుకోవడంతో పాటు, అందరూ కలిసి విందు, వినోదాలలో పాల్గొన్నారు. 2008–09 పదవ తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులందరూ ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని పాలడుగు శ్రీధర్,పగిడిమర్రి మహేష్ లు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## రైతుబీమాపై నిర్లక్ష్యం చేస్తే ఊరుకోం: మాజీ ఎమ్మెల్యే

### వెంటనే ప్రీమియం చెల్లించి రైతుబీమాను కొనసాగించాలి-బొల్లం మల్లయ్య యాదవ్

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ఆగస్టు 23,ప్రజా న్యూస్ నెట్వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** కోదాడలో రైతుబీమా ప్రీమియం చెల్లింపుపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం కోదాడలో ఆయన మాట్లాడుతూ రైతులకు, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే రైతుబీమా పథకం కొనసాగింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. రైతుబీమా ప్రీమియం సకాలంలో చెల్లించి పథకాన్ని నిరంతరాయంగా కొనసాగించేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు కుటుంబానికి కష్టకాలంలో అండగా నిలిచే రూ.5 లక్షల బీమా భరోసా పథకం నిలిచిపోతే రైతు కుటుంబాలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా రైతుబీమాను పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. రైతుబీమా కొనసాగింపుపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన ప్రకటన చేయడంతో పాటు ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తే రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని బొల్లం మల్లయ్య యాదవ్ హెచ్చరించారు.



ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

సోమవారం 24-08-2026

## ముత్యాలమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రత్యేక పూజలు

**అమ్మవారికి బోనం సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు**

**కోదాడ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్న ఎమ్మెల్యే**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ఆగస్టు 23,ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**
కోదాడ పట్టణంలోని ప్రసిద్ధ ముత్యాలమ్మ దేవాలయంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఆదివారం అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులతో కోదాడ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని ప్రార్థించారు. రైతులకు అనుకూలంగా సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని వేడుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఎమ్మెల్యే వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## తవ్వి వదిలేసిన రహదారి.. వాహనదారులకు తప్పని ఇబ్బందులు

**నెల రోజులుగా మరమ్మతులకు నోచుకోని రోడ్డు.. పట్టించుకోని అధికారులు**

**సెల్‌ఫోన్ కంపెనీపై చర్యలు తీసుకుని రహదారిని వెంటనే బాగు చేయాలని ప్రజల విజ్ఞప్తి**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ఆగస్టు 23,ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్.అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి**
: సూర్యాపేట పట్టణంలోని పీఎస్ఆర్ చౌరస్తా సమీపంలోని రాఘవ ప్లాజా వద్ద రహదారి మధ్యలో సెల్‌ఫోన్ కంపెనీ సిబ్బంది తవ్వకాలు చేపట్టి నెల రోజులుగా అలాగే వదిలేయడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తారు రోడ్డును తవ్విన అనంతరం కనీసం సిమెంట్‌తో కూడా మరమ్మతులు చేయకపోవడంతో వర్షాలకు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఇదే విధంగా స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో కూడా రోడ్డును తవ్వి కేవలం మట్టితో పూడ్చి వదిలేయడంతో వర్షాలకు పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. రహదారులపై తవ్వకాలు చేపట్టే సంస్థలు పనులు పూర్తయిన వెంటనే రోడ్లను యథావిధిగా పునరుద్ధరించేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. సంబంధిత సెల్‌ఫోన్ కంపెనీ స్పందించకపోతే మున్సిపాలిటీ అధికారులే రహదారులకు మరమ్మతులు చేపట్టి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## సూర్యాపేట జర్నలిస్టులకు కీలక పిలుపు

## బుల్లెట్ ట్రైన్ సాధన కోసం నేడు దీక్ష శిబిరంలో జర్నలిస్టుల భాగస్వామ్యం

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ఆగస్టు 23,ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**
సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించుకోవాలనే డిమాండ్‌తో నేడు రైతు బజార్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన దీక్ష శిబిరంలో సూర్యాపేట జర్నలిస్టులందరూ యూనియన్లకు అతీతంగా పాల్గొనాలని సూర్యాపేట ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనున్న దీక్షలో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమానికి సంఘీభావం తెలియజేయాలని కోరారు. సూర్యాపేట అభివృద్ధికి, ప్రజల భవిష్యత్ అవసరాలకు బుల్లెట్ ట్రైన్ సాధించడం ఎంతో కీలకమని పేర్కొంటూ కొనసాగుతున్న ఉద్యమంలో జర్నలిస్టులు తమ వంతు బాధ్యతగా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం తమ కలం ద్వారా ప్రజల గొంతుకగా నిలిచే జర్నలిస్టులు బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమానికి మద్దతుగా నేడు దీక్ష శిబిరానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

## చామలేడులో ఘనంగా రేషన్ డీలర్ పగిళ్ల రమేష్ జన్మదిన వేడుకలు


**గుర్రంపోడు, ఆగస్టు 23:లి ప్రజా న్యూస్ రిపోర్టర్ గుర్రంపోడు ప్రతినిధి దోటి.శ్రీను**
మండలంలోని చామలేడు గ్రామ రేషన్ డీలర్ పగిళ్ల రమేష్ జన్మదిన వేడుకలు ఆదివారం గ్రామంలో అత్యంత ఘనంగా, ఆత్మీయంగా జరిగాయి.ఈ సందర్భంగా గ్రామస్తులు, స్నేహితులు, యువకులు, బంధుమిత్రులు ఆయన నివాసానికి చేరుకుని కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో ఘనంగా సన్మానించి, మిఠాయిలు పంపిణీ చేశారు.అనంతరం పగిళ్ల రమేష్ మాట్లాడుతూ తనపై అభిమానం చూపి, తన జన్మదిన వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువజన సంఘం నాయకులు, మిత్రబృందం, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇలా రెజీనా.. రూ. 100 కోట్ల భారీ బడ్జెట్‌తో క్రేజీ సీక్వెల్!



కోలీవుడ్ స్టార్ హీరోయిన్ నయనతార నటిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో 'మూకుతి అమ్మన్ 2' ఒకటి. 2020లో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న దైవభక్తి, ఫాంటసీ అంశాలతో తెరకెక్కిన 'మూకుతి అమ్మన్' సినిమాకు ఇది సీక్వెల్ కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తొలి భాగానికి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించగా, రెండో భాగాన్ని ప్రముఖ నటుడు, దర్శకుడు సుందర్ సి తెరకెక్కిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం.. ఈ భారీ చిత్రంలో ప్రముఖ నటి రెజీనా కసాండ్రా కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు, ఆమె ఈ సినిమాలో ప్రతినాయక పాత్రలో కనిపించబోతున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ పాత్ర కోసం దర్శకుడు సుందర్ సి ప్రత్యేకంగా ఓ శక్తివంతమైన క్యారెక్టర్‌ను డిజైన్ చేసినట్లు సమాచారం. రెజీనాను ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని విధంగా, సరికొత్త లుక్‌లో ఈ సినిమాలో చూపించనున్నారట. నయనతారకు దీటుగా సాగే ఈ పాత్ర కథలో అత్యంత కీలకంగా ఉండబోతుందని టాక్. దీంతో 'మూకుతి అమ్మన్ 2'లో నయనతార వర్సెస్ రెజీనా పోరాటం ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో పెరిగింది. ఈ సినిమాను ప్రముఖ తమిళ నిర్మాత డాక్టర్ ఇషారి కె. గణేష్ తన వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. 'మూకుతి అమ్మన్ 2'ను రూ. 100 కోట్లకు పైగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. తొలి భాగంతో పోలిస్తే రెండో భాగంలో విజువల్ ఎఫెక్ట్స్, ఫాంటసీ అంశాలు, యాక్షన్ సన్నివేశాలను మరింత భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. సుందర్ సి ఇప్పటికే 'అరణ్మనై' హారర్‌కామెడీ ఫ్రాంచైజ్‌తో భారీ విజయాలు అందుకున్నారు. ఫాంటసీ, హారర్, కామెడీ, విజువల్ ఎలిమెంట్స్‌ను ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కించడంలో ఆయనకు మంచి అనుభవం ఉంది. ఇప్పుడు 'మూకుతి అమ్మన్ 2'ను కూడా అదే స్థాయిలో భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నారని సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. థియేట్రికల్ విడుదల తర్వాత స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక జియోహాట్‌స్టార్ భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. సినిమా ఫుటేజ్ చూసిన తర్వాతే ఈ డీల్ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఓటీటీ ఒప్పందానికి సంబంధించిన ఆర్థిక వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అయినప్పటికీ, సినిమా విడుదలకు ముందే డిజిటల్ హక్కులకు ఇంతటి క్రేజ్ రావడం 'మూకుతి అమ్మన్ 2'పై ఉన్న అంచనాలకు నిదర్శనంగా భావిస్తున్నారు.



## మగబిడ్డకి జన్మనిచ్చిన 'కేరింత' బ్యూటీ ..

టాలీవుడ్ ప్రేక్షకులకు 'కేరింత' సినిమాతో ఎంతో దగ్గరైన నటి సుకృతి అంబటి అభిమానులకు శుభవార్త చెప్పారు. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చినట్లు ఆమె సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఈ సందర్భంగా సుకృతి పంచుకున్న ఆనందకరమైన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అభిమానులతో పాటు పలువురు సినీ ప్రముఖులు కూడా ఈ కొత్త తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. దిల్ రాజు నిర్మాణంలో వచ్చిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'కేరింత' సినిమాతో సుకృతి అంబటి తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఈ చిత్రంలో ఆమె పోషించిన 'భావన' పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. తన సహజమైన నటన, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో యూత్‌లో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు.కొత్త భాషలను నేర్చుకోవడం. సినిమా విజయం సాధించినప్పటికీ, ఆ తర్వాత సుకృతి సినిమాలకు కొంత దూరంగా ఉంటూ వ్యక్తిగత జీవితానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఢిల్లీకి చెందిన సుకృతి అంబటి, చదువుకునే రోజుల నుంచే నటనతో పాటు డ్యాన్స్‌పై ప్రత్యేక ఆసక్తి పెంచుకున్నారు. అలా సినిమా రంగంలోకి అడుగుపెట్టి 'కేరింత'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇక వ్యక్తిగత జీవితం విషయానికి వస్తే.. 2022 డిసెంబర్‌లో అక్షయ్ సింగ్‌ను సుకృతి వివాహం చేసుకున్నారు. వివాహం తర్వాత ఈ జంట తమ వైవాహిక జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో తాము త్వరలో తల్లిదండ్రులు కాబోతున్నామని సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. అప్పట్లో బేబీ బంప్‌తో సుకృతి షేర్ చేసిన ఫొటోలు కూడా నెట్టింట బాగా వైరల్ అయ్యాయి. ఇప్పుడు పండంటి మగబిడ్డ జన్మించడంతో సుకృతి జీవితంలో మరో అందమైన అధ్యాయం ప్రారంభమైంది. చిన్నారి రాకతో తమ కుటుంబంలో కొత్త వెలుగులు నిండాయని ఈ జంట ఆనందం వ్యక్తం చేస్తోంది. సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ సోషల్ మీడియా ద్వారా అభిమానులతో నిరంతరం టచ్‌లో ఉంటున్న సుకృతి, ఇప్పుడు అమ్మగా తన కొత్త ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నారు. అమ్మగా కొత్త బాధ్యతలు చేపట్టిన సుకృతి అంబటికి అభిమానులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 'కేరింత'తో అలరించిన సుకృతి ఇప్పుడు మాతృత్వ ఆనందంతో కెరీర్‌కు మించిన జీవితంలోని

## రూ.100 కోట్ల క్లబ్‌లోకి లోకేష్ కనగరాజ్ సినిమా!



టాలెంటెడ్ డైరెక్టర్ అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డీసీ' (DC) సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం, విడుదలైన మొదటి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంటూ దూసుకెళ్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న ఈ చిత్రం తాజాగా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరింది. దీంతో దర్శకుడిగా సత్తచాటిన లోకీ నటుడిగా కూడా తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. శరత్ చంద్ర చటోపాధ్యాయ క్లాసిక్ నవల 'దేవదాస్' స్ఫూర్తితో, అరుణ్ మాథేశ్వరన్ తనదైన మాస్ అండ్ రా యాక్షన్ శైలిలో తెరకెక్కించిన ఈ చిత్రం టాలీవుడ్ మరియు కోలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో దేవదాస్ పాత్రలో లోకేష్ కనగరాజ్ తన తొలి నటనతోనే విమర్శకుల ప్రశంసలు అందుకోగా, చంద్ర పాత్రలో వామికా గబ్బి మరియు మరో ప్రధాన పాత్రలో సంజనా కృష్ణమూర్తి నటన సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం, ముకేష్ జి సినిమాటోగ్రఫీ, ప్రసన్న జి.కె ఎడిటింగ్ ఈ సినిమా స్థాయిని విపరీతంగా పెంచేశాయి.

## వెంకీమామ 40 ఏళ్ల సినీ ప్రస్థానానికి చిరు స్పెషల్ సెల్యూట్.. 43 మంది అభిమానుల సేవకు ప్రశంసలు



టాలీవుడ్ విక్టరీ వెంకటేష్ సినీ ప్రయాణంలో అరుదైన మైలురాయి చేరుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి ఏకంగా 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆయన అభిమానులు చేసిన సేవా కార్యక్రమం ఇప్పుడు ప్రత్యేకంగా నిలిచింది. తమ అభిమాన హీరో నాలుగు దశాబ్దాల సినీ ప్రస్థానాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడేలా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ గొప్ప కార్యక్రమాన్ని మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేకంగా అభినందించారు. ఆల్ ఇండియా విక్టరీ వెంకటేష్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. వెంకటేష్ 40 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో 43 మంది అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. తమ అభిమానాన్ని సేవగా మార్చిన వెంకీమామ అభిమానులపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈసందర్భంగా చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ తరఫున మెగాస్టార్ చిరంజీవి, ఆల్ ఇండియా వెంకటేష్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రామకృష్ణకు ప్రత్యేక అభినందన లేఖను పంపించారు. తన ఆప్తమిత్రుడు వెంకటేష్‌తో ఉన్న అనుబంధాన్ని ఆ లేఖలో చిరంజీవి హృదయపూర్వకంగా ప్రస్తావించారు.

నాలుగు దశాబ్దాలుగా తన ప్రత్యేకమైన నటనతో తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న వెంకటేష్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు చిరంజీవి. కుటుంబ కథా చిత్రాల నుంచి విభిన్నమైన పాత్రల వరకు వెంకటేష్ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఆయన ఇలాగే మరెన్నో సంవత్సరాలు ప్రేక్షకులను అలరిస్తూ, తన కెరీర్‌లో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అలాగే వెంకటేష్ అభిమానులు నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కూడా చిరంజీవి ప్రత్యేకంగా కొనియాడారు. ఒక హీరో సినీ ప్రస్థానంలో ముఖ్యమైన మైలురాయిని సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమంతో జరుపుకోవడం నిజంగా అభినందనీయమని తెలిపారు. అభిమానం కేవలం హీరోలపై ప్రేమను వ్యక్తం చేయడంలోనే కాకుండా, సేవా రూపం దాల్చినప్పుడు సమాజానికి ఎంతో స్ఫూర్తిని ఇస్తుందని చిరంజీవి ప్రశంసించారు. రక్తదాన శిబిరం నిర్వహించిన నిర్వాహకులతో పాటు స్వచ్ఛందంగా రక్తం అందించిన 43 మంది అభిమానులను 'బ్లడ్ బ్రదర్స్ అండ్ సిస్టర్స్'గా అభివర్ణిస్తూ చిరంజీవి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారు చేసిన రక్తదానం ఎంతోమంది ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా వెంకటేష్ అభిమానులు ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరుకున్నారు.